
# పార్క్‌లో నేలమీద పడుకుని..

**'ఒలింపిక్ గ్రామం'లో వసతుల కొరత • ఇటలీ స్విమ్మర్ వినూత్న నిరసన • పట్టించుకోని నిర్వాహకులు**




పారిస్: విశ్వక్రీడల నిర్వహణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఫ్రాన్స్ స్టేడియాల పునరుద్ధరణ, పారిస్ నగర సుందరీకరణ పెట్టిన దృష్టి క్రీడాకారులు ఉండే 'ఒలింపిక్ విలేజ్'పై మాత్రం పెట్టడం లేదు. ఇక్కడ వసతుల కొరత అథ్లెట్లను తీవ్రంగా వేధిస్తోంది. పారిస్‌లో ప్రస్తుతం ఎండలు మండుతుండగా ఒలింపిక్ గ్రామంలో ఏసీలు లేక ఉక్కపోతతో అథ్లెట్లు అల్లాడుతున్నారు. తాజాగా ఇటలీకి చెందిన స్విమ్మర్ థామస్ సెకాన్ ఒలింపిక్ విలేజ్‌లో ఉండలేక అక్కడికి సమీపంలో ఉన్న పార్క్‌కు వెళ్లి నేలమీదే టవల్ వేసుకుని పడుకున్న ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజా ఎడిషన్‌లో థామస్ వంద మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో స్వర్ణం గెలవగా పురుషుల 4X100 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో కాంస్యం నెగ్గి రెండు పతకాలు సాధించాడు. ఒలింపిక్ విలేజ్‌లో తనకు అసౌకర్యంగా ఉందని థామస్ పలుమార్లు నిర్వాహకులను కోరినా వాళ్లు మాత్రం పట్టించుకోలేదు. పగలు నిద్ర లేకపోవడంతో ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో తన ప్రదర్శన ఆశించినస్థాయిలో లేదని అతడు వాపోయాడు. 'ఒలింపిక్ విలేజ్‌లో ఏసీ లేదు. అక్కడ చాలా వేడిగా ఉంది. అథ్లెట్లకు ఇచ్చే ఆహారం కూడా దారుణంగా ఉంది. ఇందుకే చాలామంది అథ్లెట్లు అక్కడ్నుంచి వేరే చోటకు వెళ్లి ఉంటున్నారు. ఇది చూసీ చూడకుండా వదిలేయాల్సిన విషయం కాదు. అందరికీ తెలియాల్సిన వాస్తవం. ఇక్కడ మధ్యాహ్నం కాసేపు కునుకు తీద్దామంటే వేడి, ఉక్కపోతకు తోడు అనవసర శబ్దాలతో అది సాధ్యపడటం లేదు. అందువల్లే నేను ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఫైనల్ చేరలేకపోయాను' అని తెలిపాడు. అమెరికా టెన్నిస్ ప్లేయర్ కోకో గాఫ్‌తో పాటు మరికొంతమంది బహిరంగంగానే ఒలింపిక్ విలేజ్‌లో వసతుల కొరతపై వ్యాఖ్యానించినా నిర్వాహకులు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది. భారత క్రీడా మంత్రిత్వ శాఖ సైతం మన అథ్లెట్ల కోసం ప్రత్యేకంగా 40 పోర్టబుల్ ఏసీలను పంపిన విషయం విదితమే. వసతుల లేమి ఆటగాళ్ల ప్రదర్శనను తీవ్రంగా ప్రభావం చూపుతోందనడానికి తాజా ఘటనే నిదర్శనం.

# 100మీ. కింగ్ లైల్స్

## 9.79 సెకన్లతో పసిడి పతకం

ఈ భూగోళంపై అత్యంత వేగంగా పరిగెత్తే అథ్లెట్ ఎవరో తేలిపోయింది. ఒలింపిక్స్ అనగానే వెంటనే గుర్తుకు వచ్చే 100మీటర్ల స్ప్రింట్‌లో నయా చాంపియన్ దూసుకొచ్చాడు. గత కొన్నేండ్లుగా ఈ విభాగాన్ని అప్రతిహతంగా ఏలుతున్న జమైకా ఆధిపత్యానికి చెక్ పెడుతూ అమెరికా సంచలనం నోవా లైల్స్ అదిరిపోయే ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆదివారం అర్ధ రాత్రి(భారత కాలమానం ప్రకారం) జరిగిన పురుషుల 100మీటర్ల రేసును లైల్స్ 9.79సెకన్లలో ముగించి పసిడి పతకాన్ని సొంతం చేసుకోగా, కిషాన్ థామస్(9.79, జమైకా), కెర్లె(9.81, అమెరికా) వరుసగా రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. అసలు మాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన లైల్స్..హాట్ ఫేవరేట్లు అనుకున్న థామస్, జాకబ్స్(ఇటలీ)కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చాడు. గన్ నుంచి వదిలిన బుల్లెట్‌ను తలపిస్తూ ఎనిమిది మంది స్ప్రింటర్లు పరుగు లంఘించారు. దాదాపు ప్రతీ దశలో ఒకే రీతిలో పరిగెత్తిన అథ్లెట్లు గమ్యాన్ని చేరుకునే క్రమంలో ఒకింత తడబడ్డారు. సమయం పరంగా థామస్‌తో సమంగా నిలిచిన లైల్స్ సెకనులో ఐదువేల వంతు తేడాతో పసిడి పతకాన్ని ముద్దాడాడు. వాస్తవానికి జమైకా స్ప్రింటర్ ఒబ్లిక్ సెవిల్లె(9.91సె) నోవాకు పోటీనిస్తాడని భావించినా..ఆఖరి స్థానంతో నిరాశపరిచాడు.



లైల్స్

## 3000మీ స్టిపుల్‌చేజ్ ఫైనల్లో సాబ్లె

భారత యువ అథ్లెట్ అవినాశ్ ముకుంద్ సాబ్లె అదరగొట్టాడు. సోమవారం జరిగిన పురుషుల 3000మీ స్టిపుల్‌చేజ్ రేసులో సాబ్లె ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. తద్వారా విశ్వక్రీడల్లో తుది పోరుకు అర్హత పొందిన తొలి భారత అథ్లెట్‌గా సాబ్లె నిలిచాడు. హీట్స్-2లో పోటీకి దిగిన సాబ్లె 8:15:43 సెకన్ల టైమింగ్‌తో ఐదో స్థానంలో నిలిచాడు. ఇదే రేసులో పాల్గొన్న టిండఫ్ట్(మొరాకో) అగ్రస్థానం దక్కించుకున్నాడు. తొలి రెండు ల్యాప్‌లు దూకుడు కనబరిచిన సాబ్లె..మిగిలిన ల్యాప్‌లలో ఒకింత వెనుకంజ వేశాడు. మరోవైపు మహిళల 400మీ రేసులో కిరణ్ పహల్(52.51సె) ఏడో స్థానంలో నిలిచింది.

# చేరువగా వచ్చి.. చేజారి

- కాంస్య పోరులో ఓడిన లక్ష్యసేన్
- షూటింగ్ మిక్స్‌డ్ టీమ్‌లో వెంటాడిన దురదృష్టం

**క్వార్టర్స్‌లో నిషా దహియా నిష్క్రమణ.. టేబుల్ టెన్నిస్ టీమ్ ఈవెంట్‌లో ముందంజ**



**పారిస్ ఒలింపిక్స్‌లో ఆరు రోజుల వ్యవధిలోనే మూడు పతకాలు సాధించిన భారత క్రీడాకారులు అడుగులు మళ్లీ ఆ దిశగా సాగడం లేదు. పదో రోజు ఆటల్లో భాగంగా దేశానికి రెండు పతకాలు అందినట్టే అంది త్రుటిలో చేజారాయి. బ్యాడ్మింటన్‌లో లక్ష్యసేన్ తొలి గేమ్ గెలిచి 'ఇక పతకం ఖాయమే' అనుకుంటున్న తరుణంలో గాడి తప్పితే.. స్కీట్ షూటింగ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ ఒకే ఒక్క పాయింట్ తేడాతో పతకం కోల్పోయింది. సోమవారం నుంచి మొదలైన రెజ్లింగ్ పోటీలను తొలి రోజే భారత్ ఓటమితో ఆరంభించింది. టేబుల్ టెన్నిస్ టీమ్‌ఈవెంట్‌లో మన ప్యాడ్లర్లు క్వార్టర్స్ చేరారు.**

పారిస్: విశ్వక్రీడల పదో రోజు పోటీల్లో భారత్‌కు మరో రెండు పతకాలు అందినట్టే అంది త్రుటిలో చేజారాయి. పురుషుల బ్యాడ్మింటన్‌లో కాంస్య పోరుకు అర్హత సాధించిన తొలి ఆటగాడిగా రికార్డులకెక్కిన యువ షట్లర్ లక్ష్యసేన్ పతకం గెలిచి చరిత్ర సృష్టించే అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకున్నాడు. కాంస్య పతక పోరులో సేన్ 21-13, 16-21, 11-21తో లీ జి జియా (మలేషియా) చేతిలో ఓడాడు. తొలి గేమ్‌ను అలవోకగా గెలుచుకున్న సేన్ రెండో గేమ్ ఆరంభంలోనూ అదరగొట్టాడు. అతడు 7 పాయింట్ల వద్ద ఉండగా ప్రత్యర్థి 2 పాయింట్లతో వెనుకబడి సేన్‌ను ఎదుర్కోవడానికి ఇబ్బందిపడ్డట్టే కనిపించాడు. కానీ ఆ తర్వాత లీ క్రమంగా పుంజుకుని భారత షట్లర్‌కు షాకిచ్చాడు. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ జియా అదే దూకుడును కొనసాగిస్తూ గేమ్‌తో పాటు కాంస్యాన్ని సొంతం చేసుకున్నాడు. ఆట మధ్యలో కుడిచేయి మోచేతి వద్ద గాయం లక్ష్యసేన్‌ను పదే పదే వేధించడమూ అతడి ఏకాగ్రతను దెబ్బతీసింది. ఇక బ్యాడ్మింటన్ పురుషుల ఫైనల్‌లో డెన్మార్క్ షట్లర్ విక్టర్ అక్సెల్సెన్ 21-11, 21-11తో కున్లావత్ విదిత్సర్న్ (థాయ్‌లాండ్)ను ఓడించి వరుసగా ఒలింపిక్స్‌లో వరుసగా రెండో స్వర్ణం సాధించాడు. కున్లావత్‌కు రజతం దక్కింది.

### టేబుల్ టెన్నిస్‌లో క్వార్టర్స్‌కు..



వ్యక్తిగత పోటీలలో క్వార్టర్స్ వరకూ వెళ్లి అక్కడ భంగపడ్డ భారత ప్యాడ్లర్లు టీమ్ ఈవెంట్‌లో రాణించి మరోసారి పతకం దిశగా సాగుతున్నారు. మనికా బాత్ర, ఆకుల శ్రీజ, అర్చనా కామత్‌తో కూడిన భారత బృందం.. 3-2తో రొమేనియాను చిత్తు చేసింది. మొదట శ్రీజ-అర్చన డబుల్స్ మ్యాచ్‌లో 3-0తో గెలుపొందగా ఆ తర్వాత మనిక సైతం సింగిల్స్ మ్యాచ్‌ను సొంతం చేసుకుని భారత్‌ను 2-0 ఆధిక్యంలో నిలిపింది. కానీ శ్రీజ, కామత్ సింగిల్స్ రౌండ్లలో ఓడటంతో స్కోరు 2-2తో సమమైంది. చివరి సింగిల్స్‌లో మనిక గెలుపుతో భారత్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది.

### వెంట్రుకవాసిలో తప్పిన గురి..



షూటింగ్‌లో ఇది వరకే మూడు పతకాలు తెచ్చిన షూటర్లు మరో పతకం సాధించే అవకాశాన్ని వెంట్రుకవాసిలో కోల్పోయారు. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ బ్రాంజ్ మెడల్ మ్యాచ్‌లో మహేశ్వరి చౌహాన్, అనంత్‌జీత్‌సింగ్ నరుకాతో కూడిన భారత్ 43 పాయింట్లు స్కోరు చేయగా యిటింగ్ జియాంగ్, జియాన్లిన్ లియు ప్రాతినిథ్యం వహిస్తున్న చైనా 44 పాయింట్లు సాధించి పతకాన్ని ఎగురేసుకుపోయింది. అంతకుముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లో భారత ద్వయం 146 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి పతక పోరుకు అర్హత సాధించింది. కానీ కీలక దశలో ఒక్క పాయింట్ తేడాతో పతకాన్ని చేజార్చుకుంది.

### ముగింపు వేడుకలకు పతాకధారిగా మను



పారిస్: ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు యువ షూటర్ మను భాకర్ భారత పతాకధారిగా వ్యవహరించనుంది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం(ఐవోఏ) ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. పారిస్‌లో భారత్‌కు కాంస్య పతకంతో బోణీ కొట్టిన మను.. రెండ్రోజుల వ్యవధిలోనే సహచర షూటర్ సరబ్‌జ్యోత్ సింగ్‌తో కలిసి రెండో పతకం సాధించింది. తద్వారా ఒకే ఎడిషన్‌లో రెండు పతకాలు సాధించిన మొదటి షూటర్‌గా రికార్డులకెక్కింది. ముగింపు వేడుకలలో పురుష పతాకధారి పేరును త్వరలో ప్రకటించనున్నారు.

### గ్రాహం థోర్ప్ కన్నుమూత



లండన్: ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ గ్రాహం థోర్ప్ (55) కన్నుమూశారు. గత రెండేండ్లుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న థోర్ప్ సోమవారం తుదిశ్వాస విడిచినట్టు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) తెలిపింది. 1993 నుంచి 2005 వరకు ఇంగ్లండ్ తరఫున ఆడిన థోర్ప్.. వంద టెస్టులు, 82 వన్డేలలో ప్రాతినిథ్యం వహించాడు. టెస్టులలో 44.66 సగటుతో 6,774 పరుగులు చేయగా వన్డేలలో 2,830 రన్స్ సాధించారు. ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటించాక కొన్నాళ్లపాటు అఫ్గానిస్థాన్ జట్టుకు హెడ్‌కోచ్‌గా పనిచేశారు. థోర్ప్ మృతి పట్ల ఇంగ్లండ్ ప్రస్తుత, మాజీ ఆటగాళ్లు తమ సంతాపం వ్యక్తం చేశారు.

### పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 21 | 17 | 14 | 52 |
| 2 | యూఎస్ఏ | 19 | 29 | 27 | 75 |
| 3 | ఆస్ట్రేలియా | 13 | 11 | 8 | 32 |
| 4 | ఫ్రాన్స్ | 12 | 15 | 18 | 45 |
| 5 | బ్రిటన్ | 11 | 13 | 17 | 41 |
| 6 | కొరియా | 11 | 8 | 7 | 26 |
| 59 | భారత్ | 0 | 0 | 3 | 3 |

దే: దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

### ఓటమితో ఆరంభం..



సోమవారం నుంచి మొదలైన రెజ్లింగ్ పోటీలను భారత్ ఓటమితో ఆరంభించింది. మహిళల 68 కిలోల ఫ్రీ స్టయిల్ విభాగంలో పోటీపడ్డ యువ రెజ్లర్ నిషా దహియా క్వార్టర్స్‌లో 8-10తో పక్ సొల్ గమ్ (ఉత్తర కొరియా) చేతిలో ఓడింది. మూడో బౌట్ మరో 90 సెకన్లలో ముగుస్తుందనగా నిషా కుడిచేతి వేలికి గాయమవడంతో ఆమె 'పట్టు' కోల్పోయింది. మెడికల్ బ్రేక్ తర్వాత మళ్లీ బరిలోకి దిగినా నిషాకు ఓటమి తప్పలేదు. కాగా క్వార్టర్స్‌లో ఓడినా నిషాకు మరో అవకాశం ఉంది. సొల్ గమ్ ఫైనల్ చేరితే 'రెపిచేజ్' రౌండ్‌తో నిషా మరోసారి బరిలోకి దిగొచ్చు. అంతకుముందు తొలి బౌట్‌లో నిషా 6-4తో టెటియానా సొవ (ఉక్రెయిన్)ను ఓడించింది.

### అమిత్‌పై ఒక మ్యాచ్ వేటు



పారిస్: భారత హాకీ జట్టు డిఫెండర్ అమిత్ రోహిదాస్ ఒక మ్యాచ్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఆదివారం క్వార్టర్స్ పోరులో భాగంగా గ్రేట్ బ్రిటన్‌తో జరిగిన మ్యాచ్‌లో అమిత్.. ప్రత్యర్థి జట్టు ఆటగాడు కల్నన్‌ను ఉద్దేశపూర్వకంగా హాకీ స్టిక్‌తో కొట్టాడని ఆరోపిస్తూ రిఫరీ రెడ్ కార్డ్ చూపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) నియామవళిని అనుసరించి అమిత్‌పై ఒక మ్యాచ్ వేటు పడింది. దీంతో అతడు మంగళవారం జర్మనీతో జరిగే సెమీస్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండడు. ఇదిలా ఉండగా ఈ నిర్ణయంపై హాకీ ఇండియా ఆందోళన వ్యక్తం చేస్తూ ఎఫ్ఐహెచ్ జ్యూరీ బెంచ్‌కు లేఖ రాసింది. మ్యాచ్‌లో అమిత్ కావాలని కల్నన్ తలమీద కొట్టలేదని అది యాదృచ్ఛికంగా జరిగిందని హాకీ ఇండియా వాదిస్తోంది.

### పతకానికి ముందు ప్రశాంతత





ఉక్రెయిన్ హైజంపర్ యరొస్లవ మహుచిఖ్ తన ఫైనల్ పోటీలకు ముందు ప్రశాంతంగా నిద్రిస్తున్న దృశ్యమిది. ఈ పోటీలో ఆమె తన దేశానికి తొలి స్వర్ణాన్ని అందించింది. ఇదే ఈవెంట్‌లో అదే దేశానికి చెందిన ఇరినా గెరాషెంకొ కాంస్యం దక్కించుకుంది. గత రెండేండ్లుగా రష్యా సాగిస్తున్న దారుణ మారణకాండకు బలౌతున్న ఉక్రెయిన్‌కు ఈ పతకాలు కాస్త స్వాంతననిస్తున్నాయి.

---



### తాటికొండలో కొత్తరాతి యుగపు ఆనవాళ్లు

**పురావస్తు శాఖ పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి వెల్లడి**

భూత్పూర్, ఆగస్టు 5: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం తాటికొండ గ్రామ శివారులోని భైరవగుట్టపై దాదాపు 4 వేల ఏండ్లకు పూర్వం మానవుడు తయారు చేసిన కొత్తరాతి యుగపు ఆనవాళ్లను గుర్తించినట్టు పురావస్తు శాఖ పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. భూత్పూర్ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యుడు అశోక్ గౌడ్ విజ్ఞప్తి మేరకు గుట్టపైకి వెళ్లి పరిశీలించగా ఆ కాలంలో మానవుడు తన అవసరాల కోసం ఆయుధాల తయారీని గుర్తించినట్టు వివరించారు. ఆది మానవుడు నివాసం ఉన్న సమయంలో గొడ్డండ్లను సానబెట్టే విధానం.. 7 నుంచి 15 అంగుళాల పొడవు, రెండు-నాలుగు అంగుళాల వెడల్పు, ఒక్క అంగుళం లోతు గాళ్లు ఇప్పటికీ ఆనవాళ్లుగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఆయన వెంట సత్తూర్ అశోక్ గౌడ్, బంగారు బాలకృష్ణ ఉన్నారు.

# నేరం చేసిన 20 ఏండ్లకు చిక్కిన నిందితుడు

- హైదరాబాద్‌లోని ఎస్‌బీఐకి రూ.50 లక్షల కుచ్చుటోపీ
- బాబాగా అడ్రస్‌లు మార్చుతూ పరారీలో చలపతిరావు
- కోర్టు చనిపోయినట్లు ప్రకటించినా వేట వదలని దర్యాప్తుసంస్థ
- తమిళనాడులోని ఓ కుగ్రామంలో అరెస్టు

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): 20 ఏండ్లుగా ముప్పుతిప్పలు పెడుతున్న ఓ నిందితుడిని సీబీఐ ఎట్టకేలకు పట్టుకుంది. తమిళనాడులోని ఓ కుగ్రామంలో నిందితుడు చలపతిరావును అదుపులోకి తీసుకుంది. వివరాల్లోకి వెళ్తే హైదరాబాద్‌లోని చందులాల్ బారాదరి ఎస్‌బీఐ బ్రాంచ్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వీ చలపతిరావు తన స్నేహితులు, కుటుంబసభ్యుల పేరిట నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి రూ.50 లక్షలు వాడుకున్నాడు. ఆ తర్వాత మోసాన్ని గుర్తించిన బ్యాంకు అధికారులు సీబీఐకి ఫిర్యాదు చేశారు. దీంతో 2002 మే 1న కేసు ఫైల్ అయ్యింది. 2004 నుంచి చలపతిరావు అదృశ్యమయ్యాడు. ఈ కేసులో అతడి భార్యపై కూడా సీఐబీ కేసు నమోదు చేసింది. ఏడేండ్ల తర్వాత తన భర్త చనిపోయినట్టు ప్రకటించాలని కోరుతూ హైదరాబాద్ సివిల్ కోర్టులో చలపతిరావు భార్య పిటిషన్ దాఖలు చేయడంలో వారు ఆర్డర్ ఇచ్చారు. దీంతో సీబీఐ ప్రొక్లైమెడ్ అఫెండర్ (పీఓ)గా ప్రకటించింది. చలపతిరావు ఆస్తిని జప్తు చేసేందుకు సీబీఐ ప్రయత్నించగా, అతడి భార్య హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుంది.

**అవతారాలు మార్చుతూ..**

2007లో తమిళనాడులోని సేలం పారిపోయిన చలపతిరావు అక్కడ వినీత్‌కుమార్‌గా పేరు మార్చుకున్నాడు. ఓ మహిళను పెండ్లి చేసుకొని, ఆధార్ కార్డు కూడా సంపాదించాడు. మొదటి భార్యతో మాత్రం కాంటాక్ట్‌లోనే ఉన్నాడు. ఆ తర్వాత 2014లో భోపాల్ పారిపోయాడు. అక్కడ లోన్ రికవరీ ఏజెంట్‌గా పనిచేశాడు. 2016లో ఉత్తరాఖండ్‌లోని రుద్రాపూర్‌కు వెళ్లి అక్కడ స్కూల్ టీచర్‌గా పనిచేశాడు. అక్కడ్నుంచి 2016లో పారిపోయాడు. ఆ తర్వాత ఔరంగాబాద్‌లోని వేరుల్ గ్రామంలో ఓ ఆశ్రమానికి వెళ్లాడు. అక్కడ తన పేరును స్వామి విధితాత్మానంద తీర్థగా మార్చుకొని ఆధార్ కార్డు కూడా పొందాడు. 2021 డిసెంబర్‌లో ఆశ్రమాన్ని విడిచిపెట్టి, రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌కు మకాం మార్చాడు. ఈ ఏడాది జూలై 8 వరకు అక్కడే ఉన్నాడు. అక్కడి నుంచి సముద్రమార్గం ద్వారా శ్రీలంక వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఈ క్రమంలోనే తిరునెల్వేలికి చేరుకున్నాడు. అక్కడికి సమీపంలోని నర్సింగనల్లూర్ గ్రామంలో సీబీఐ ఆయనను అదుపులోకి తీసుకుంది. అతడికి ఈనెల 16 వరకు సీబీఐ కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కేసు పునఃప్రారంభించి, విచారణ చేపడుతున్నట్టు సీబీఐ తెలిపింది.

**• మంత్రికీ తప్పని తిప్పలు**



వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలను సోమవారం మంత్రి కొండా సురేఖ కలెక్టర్ సత్యశారదతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలకు చేరుకోవడానికి వాన నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సివచ్చింది. ఇటీవల కురిసిన వర్షానికి దవాఖాన ఆవరణలో నీరు నిలిచి అంతర్గత రోడ్లు పూర్తిగా నీటితో నిండిపోయాయి. శానిటేషన్ వ్యవస్థ పనిచేయకపోవడం వర్షపు నీరు అలానే ఉండిపోయింది. దీంతో రోడ్డుపై కారు దిగిన మంత్రి కలెక్టర్ సత్యశారదతో కలిసి దవాఖానలోకి వాననీటిలో నుంచే నడుచుకుంటూ వెళ్తూ ఇబ్బందిపడ్డారు. -వరంగల్ చౌరస్తా

# మార్చిలో మరో ఎన్నికల సమరం!

- మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు కసరత్తు
- వచ్చేనెల 30 నుంచి ఓటర్ల జాబితా రూపకల్పన
- ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉమ్మడి ఏడు జిల్లాల పరిధిలో మరోసారి రాజకీయ సందడి నెలకొననున్నది. మార్చిలో ఒక శాసనమండలి పట్టభద్రుల స్థానం, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల ప్రక్రియను ఎలక్షన్ కమిషన్ ప్రారంభించింది. పూర్తిస్థాయి ఓటరు జాబితా షెడ్యూల్‌ను విడుదల చేసింది. వచ్చే ఏడాది మార్చి 29తో కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి పదవీకాలం ముగియనున్నది. ఇవే జిల్లాల పరిధి టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ కే రఘోత్తంరెడ్డి, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీకాలం కూడా ముగియనున్నది. ఆయా నియోజకవర్గాల పరిధిలో సెప్టెంబర్ 30 నుంచి ఓటరు జాబితా దరఖాస్తులను స్వీకరించనున్నారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరిలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నదని, మార్చిలో ఎన్నికలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్, ఏడాదిలోపు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, తదితర అంశాలపై ఇప్పటికే నిరుద్యోగ యువత తీవ్ర ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు ఆసక్తికరంగా మారనున్నట్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**ఓటరు జాబితా షెడ్యూల్**

| | |
|---|---|
| దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం | సెప్టెంబర్ 30 |
| దరఖాస్తుల స్వీకరణ గడువు | నవంబర్ 6 |
| ముసాయిదా జాబితా ప్రకటన | నవంబర్ 23 |
| ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు | నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వరకు |
| తుది ఓటర్ల జాబితా ప్రకటన | డిసెంబర్ 30 |

# అమెరికాలో సిద్దిపేట యువకుడి మృతి



సాయిరోహిత్(ఫైల్)

మద్దూరు (ధూళిమిట్ట), ఆగస్టు 5: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం కూటిగల్‌కు చెందిన ఓ యువకుడు అమెరికాలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. తుషాలపురం మంగవ్వ-మహదేవ్‌ల పెద్ద కుమారుడు సాయి రోహిత్ (23) హైదరాబాద్ సీవీఆర్ కాలేజీలో 2022లో బీటెక్ పూర్తి చేశాడు. ఎమ్మెస్సీ చదివేందుకు నిరుడు డిసెంబర్ 20న అమెరికాకు వెళ్లాడు. వాషింగ్టన్ సియోటెల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మిస్సోరి కాలేజీ యూనియన్ బ్రాంచ్‌లో చదువుకుంటూ స్నేహితులతో కలిసి రూమ్‌లో ఉంటున్నాడు. జూలై 22న బయటకెళ్లి, తిరిగి క్యాబ్‌లో రూముకు వస్తుండగా కొంత దూరం రాగానే మరో క్యాబ్‌లోకి మారాడు. అప్పటి నుంచి కనిపించకుండా పోయాడని స్నేహితుడు అవినాశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తానా సహాయంతో సాయిరోహిత్ కోసం వెతకగా జూలై 24న సమానుష్ సరస్సులో మృతదేహం లభ్యమైంది. జూలై 25న సాయిరోహిత్ మృతి విషయమై స్నేహితులు కూటిగల్‌లోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.